ప్రజాశక్తి

శనివారం 31 ఆగస్టు 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

వణుకుతున్న పల్లెలు

- పెరుగుతున్న జ్వర పీడితులు
- మండలాల్లో మలేరియా వ్యాప్తి
- పిహెచ్‌సిలకు రోగుల తాకిడి
- ఈ ఏడాది జ్వర పీడితులు 12,693 మంది
- మలేరియా 195, డెంగీ 124 కేసులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి విలేకరి

జిల్లాలో పల్లెలు వణుకుతున్నాయి. చలి జ్వరాలు ముసురుకున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పిహెచ్‌సి)కు రోగుల తాకిడి పెరుగుతోంది. అడపాదడపా కురుస్తున్న వర్షాలు, గ్రామ, పట్టణాల్లో అపరిశుభ్రతతో వ్యాధులు ప్రబలుతున్నాయి. గతం కంటే మలేరియా విస్తరిస్తోంది. వైరల్ జ్వరాలతో పాటు మలేరియా, టైఫాయిడ్, డెంగీతో బాధపడుతూ పెద్ద సంఖ్యలో జనం ఆసుపత్రులపాలవుతున్నారు. అందుబాటు లోవున్న చోట ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లగా, లేనిచోట ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. దాదాపు అన్ని గ్రామాల్లోనూ జ్వరపీడితులు వున్నారు. జ్వరం, దగ్గు, జలుబు, ఒంటి నొప్పులు, చలితో కూడిన లక్షణాలతో ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తున్నారు. ప్రాథమిక ఆసుపత్రులకు జ్వరాలతో వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. అనకాపల్లి మండలం తుమ్మపాల ప్రాథమిక ఆసుపత్రికి ఏప్రిల్‌లో మిగతా 2లో..



నక్కపల్లి ఆసుపత్రిలో జ్వర పీడితులు

వార్త 2లో..



వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

లోకేష్ ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ

నేడు విశాఖలో రాజ్యసభ పిటిషన్ల కమిటీ పర్యటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాజ్యసభ పిటిషన్ల కమిటీ తన స్టడీ విజిట్‌లో భాగంగా శనివారం ఉదయం 10 గంటల నుండి ఒంటి గంట వరకూ విశాఖ నగరంలో పర్యటించనుంది. దీనిలో భాగంగా కమిటీ సభ్యులు విశాఖపట్నం పోర్ట్ అథారిటీ, హిందుస్థాన్ షిప్‌యార్డ్, స్టీల్‌ప్లాంట్, ఎపి మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎపి ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సంస్థల ప్రతినిధులతో పాటు పోర్టు, షిప్పింగ్ వాటర్ వేస్, స్టీల్, జల్‌శక్తి అధికారులతో ఈ సందర్భంగా సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 5 గంటల వరకు మెడిటెక్ జోన్‌లో పర్యటించనున్నారు. అనంతరం కమిటీ సభ్యులు సెప్టెంబర్ 1న విశాఖ నుంచి ఢిల్లీకి తిరుగు ప్రయాణం కానున్నారు.

పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలి

వార్త 5లో..

'ఉక్కు' పరిరక్షణకు 1న ధర్నాలు

వార్త 2లో..

సుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలి : సిపిఎం

వార్త 5లో..

మొదటి పేజీ తరువాయి..

వణుకుతున్న పల్లెలు

జ్వరాలతో బాధపడ్డ రోగులు రోజుకు ఐదుగురురాగా, ఇప్పుడు 30 మంది వరకు వస్తున్నారు. ఒక్కోరోజు ఈ సంఖ్య పెరుగుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. గతేడాది జనవరి ఒకటి నుంచి ఆగస్టు 29 వరకు జిల్లా వ్యాపితంగా 11,567 జ్వరాలు నమోదుకాగా, ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి ఆగస్టు 29 వరకు 12,693 జ్వరాలు నమోదయ్యాయి.

మలేరియా వ్యాప్తి క్రమంగా పెరుగుతోంది. సాధారణ జ్వర లక్షణాలతో ఆసుపత్రులకు వచ్చిన వారికి మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు చేయగా, మలేరియా బయటపడుతోంది. జ్వరాల్లో ఎక్కువ మందికి టైఫాయిడ్ వున్నట్లు వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో తేలుతోంది. గతేడాది జనవరి ఒకటి నుంచి ఆగస్టు 29 వరకు 113 మలేరియా కేసులు నమోదుకాగా, ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి ఆగస్టు 29 నాటికి 195 మందికి మలేరియా కేసులు వచ్చాయి. గతేడాది డెంగీ 190 కేసులుండగా, ఈ ఏడాది 124 వున్నాయి. గతంలో జ్వరం వచ్చిన ఐదు రోజులకు తగ్గిపోగా, ఇప్పుడు కొంతమందికి పది నుంచి పద్నాలుగు రోజుల వరకు ఉంటోంది. వ్యాధి నిరోధక శక్తి తక్కువున్న వారికి జ్వరం ఎక్కువ రోజులు వుంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు. అనకాపల్లి మండలంలోని తగరంపూడి ప్రాథమిక ఆసుపత్రికి రోజుకు నలభైమంది వరకు జ్వరాలతో వస్తున్నారు. వీరిలో పది మందికి టైఫాయిడ్ ఉంటోంది. ఆసుపత్రిలో మలేరియా, టైఫాయిడ్, డెంగీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి అవసరమైన మందులు అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. రోలుగుంట, కోటవురట్ల, రావికమతం, దేవరాపల్లి, నాతవరం, నక్కపల్లి, పాయకరావుపేట, చీడికాడ, మాడుగుల, రాంబిల్లి, ఎస్.రాయవరం, అచ్యుతాపురం, పరవాడ మండలాలు, అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం పట్టణంలో జ్వరాలు ఎక్కువగా వున్నాయి.

పిహెచ్‌సిలను అప్రమత్తం చేశాం



జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అప్రమత్తం చేశాం. పిహెచ్‌సికి వచ్చే రోగుల లక్షణాలను బట్టి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నాం. అవసరమైన మందులు ఇస్తున్నాం. పిహెచ్‌సిల్లో వైద్యుల కొరతలేదు. మందులు సంపూర్ణంగా ఉన్నాయి. జ్వరంతో బాధపడుతున్న రోగులు సమీపంలోని పిహెచ్‌సికి వెళ్లాలి. ప్లేట్‌లెట్ కౌంట్ పరీక్షలు కూడా పిహెచ్‌సిల్లో వున్నాయి. అత్యవసర కేసులను ఎన్‌టిఆర్ ఆసుపత్రికి పంపిస్తున్నాం.

ఎంఎస్‌వికె.బాలాజీ, అనకాపల్లి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి



దీక్షల్లో కూర్చున్న సిఐటియు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

'ఉక్కు' పరిరక్షణకు 1న ధర్నాలు

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం సెప్టెంబర్ 1న సిఐటియు ఆధ్వర్యంలో విశాఖలోని అగనంపూడి ఎస్‌బిఐ జంక్షన్, వడ్లపూడి సచివాలయం, పెదగంట్యాడ ఏరియాల్లో ఉదయం 9 గంటల నుండి ఒంటి గంట వరకు ధర్నాలు నిర్వహించనున్నట్టు స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1296వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు పోరాటాన్ని మరింత ఉధృతం చేయాల్సిన అవసరముందన్నారు. ఈ క్రమంలోనే సెప్టెంబర్ 1న ఆందోళనలకు పిలుపునిచ్చామని, ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సంఘం సీనియర్ నాయకులు ఎన్.రామారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రజల సంపదని, కార్పొరేట్లకు అప్పగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని అన్నారు. ఉక్కు కర్మాగారం ఆవిర్భావానికి జరిగిన పోరాటాలను గుర్తుచేశారు. కేంద్రంపైనా, స్థానిక ఉక్కు యాజమాన్యం తీరుపైనా పోరాటాలు చేయడం ద్వారానే ప్లాంట్‌ను కాపాడుకోగలమన్నారు. దీక్షల్లో సంఘం ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, నాయకులు బి.అప్పారావు, కె.గంగాధర్, టివికె.రాజు, పుల్లారావు, వి.మురళి, డి.సత్యనారాయణ, రమేష్, పిజికె.రాజు, మొహిద్దిన్, పవన్ పాల్గొన్నారు.

1న గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎవిస్ ఓవర్సీస్ (ద్వారకానగర్) సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ - 2024 జరుగుతుందని సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి.ఎ.రాజు తెలిపారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం విశాఖ బీచ్ రోడ్‌లోగల పామ్ బీచ్ హోటల్‌లో ఆ రోజున ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలు వరకు జరుగుతుందని తెలిపారు. ఈ ఫెయిర్‌లో 15కి పైగా దేశాలు నుంచి టాప్ - 40 యూనివర్సిటీలు పాల్గొంటాయన్నారు. మీడియా సమావేశంలో సంస్థ మేనేజర్ బి.రవి తేజ, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఆర్.క్రిస్టోఫర్ పాల్గొన్నారు.

లోకేష్ ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా విశాఖలో పర్యటిస్తున్న రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తన రెండో రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం టిడిపి జిల్లా కార్యాలయంలో వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలను కలుసుకున్నారు. సమస్యల పరిష్కార వేదికైన 'ప్రజాదర్బార్'ను అక్కడే నిర్వహించి ప్రజల నుంచి నేరుగా విజ్ఞప్తులు స్వీకరించారు. అందరినీ ఆప్యాయంగా పలకరించి వారితో కలిసి ఫొటోలు దిగారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖలకు పంపి పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ప్రేమించాలంటూ వెంటపడి, ఉన్మాది చేతిలో కుమార్తెను కోల్పోయిన తమ కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని అనకాపల్లి జిల్లా కొప్పుగొండుపాలెంకు చెందిన బద్ది వెంకటరమణ విజ్ఞప్తి చేశారు.

అమెరికాలో విద్యనభ్యసిస్తున్న తమ కుమారుడిని అక్కడి పోలీసులు అరెస్ట్ చేశారని, ఏం జరిగిందో ఇంతవరకు సమాచారం లేదని విశాఖకు చెందిన ఎ.అప్పలకొండ మంత్రి నారా లోకేష్‌ను కలిసి కన్నీటి పర్యంతమయ్యారు. ఎలాగైనా తమ కుమారుడిని అమెరికా నుంచి దేశానికి తీసుకువచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. వారసత్వంగా సంక్రమించిన భూమిని కబ్జా చేయడంతో పాటు చంపుతామని బెదిరిస్తున్నారని, తమ భూమిని కబ్జారాయుళ్ల నుంచి విడిపించడంతో పాటు ప్రాణరక్షణ కల్పించాలని అనకాపల్లి జిల్లా బంగారయ్యపేటకు చెందిన మాతిరెడ్డి రాజునాయుడు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రా యూనివర్సిటీర్సిటీ నాటకరంగ విభాగంలో అతిథి అధ్యాపకునిగా నియమించాలని గజపతినగరం నియోజకవర్గం కొత్తపాలెంకు చెందిన వి.త్రినాథరావు విజ్ఞప్తి చేశారు. కంప్యూటర్ సైన్స్‌లో డిగ్రీ చదివిన తనకు ఉద్యోగం కల్పించాలని విశాఖకు చెందిన సనపాల మనోజ్ కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం జిఒ 61ను అమలుచేయాలని, బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని దళిత హక్కుల సంక్షేమ సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల విశ్వవిద్యాలయాలకు ఉత్తరాంధ్ర బిసి ఆచార్యులనే వైస్ ఛాన్సలర్లుగా నియమించాలని ఉత్తరాంధ్ర విద్యార్థి సేన ప్రతినిధులు కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఆశా కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు.



వినతిపత్రాలు ఇచ్చేందుకు ఉత్తరాంధ్ర నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు

గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించరూ..

జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు, పింఛనుదారులకు 010 పద్దు కింద జీతాలు, పెన్షన్లు ఇవ్వాలని, జిల్లా గ్రంథాలయ సంస్థ స్థలంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనాలు నిర్మించాలని రాష్ట్ర విద్య, ఐటి, గ్రంథాలయాల శాఖ మంత్రి నారా లోకేష్‌కు జిల్లా గ్రంథాలయ సంస్థ పింఛన్‌దారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.త్రిమూర్తులు, పి.మల్లేశ్వరరావు, ట్రెజరర్ కాకి అప్పారావులు వినతిపత్రం సమర్పించారు. గ్రంథాలయాల భవనాలు నిర్మించే పనిలోనే ఉన్నానని మంత్రి లోకేష్ అన్నారని మల్లేశ్వరరావు, త్రిమూర్తులు ఆ తర్వాత మీడియాకు తెలిపారు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గ్రంథాలయ ఉద్యోగుల, పింఛనుదారుల సమస్యల పరిష్కారం పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. అనంతరం ఎంపీ ఎం.శ్రీ భరత్‌కు, చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజులకు సంఘం నాయకులు వినతిపత్రాలు అందజేశారు.

ఓర్పు, సహనంతో ప్రజా సమస్యలను పరిష్కరించాలి

కూటమి ప్రభుత్వం విజయం సాధించడంలో అందరి భాగస్వామ్యం ఉందని లోకేష్ అన్నారు. జివిఎంసి కార్పొరేటర్లతో పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేటర్లు ఓర్పు, సహనంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.



వినతులు స్వీకరిస్తున్న లోకేష్

అధికారంలోకి వచ్చిన తర్వాత సహజంగా కార్యకర్తలను విస్మరిస్తారని, అలా జరగకుండా చూడాలని అన్నారు. అనంతరం ఆయన టిడిపి అనుబంధ విభాగాల సభ్యులతో సమావేశమయ్యారు.

కెకె.లైన్‌లో రైళ్ల దారి మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారీ వర్షాల సూచన కారణంగా కొత్తవలస-కిరండూల్ లైన్‌లో నడిచే 18514 విశాఖపట్నం - కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 1 వరకు విజయనగరం, రాయగడ, కోరాపుట్ మీదుగా మళ్లించిన మార్గంలో నడుస్తుందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలు దంతెవాడలో షార్ట్ టర్మినేట్ అవుతుంది. అలాగే 18513 కిరండూల్-విశాఖపట్నం నైట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 1 వరకు దంతెవాడలో బయలుదేరి కోరాపుట్, రాయగడ, విజయనగరం మీదుగా దారి మళ్లించిన మార్గంలో నడుస్తుంది.

నగర మార్కెట్లోకి ఫియోనా రిఫైన్డ్ ఆయిల్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎడిబుల్ ఆయిల్స్ మార్కెట్‌లో అగ్రగామిగా ఉన్న బంగే ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తాలూకా ఫియోనా రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను సినీ నటి లావణ్య త్రిపాఠి విశాఖ మార్కెట్‌లోకి శుక్రవారం సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా బీచ్‌రోడ్‌లోని గ్రాండ్ బే హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ రిఫైన్డ్ సన్ ఫ్లవర్ ఆయిల్‌లో పౌష్టికాహారానికి కీలకమైన విటమిన్ ఎ, డి, ఇలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. సరైన మొత్తంలో ఆహారం తీసుకోలేని చాలా మందికి ఇది ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో బంగే ఇండియా వైస్ ప్రెసిడెంట్ అండ్ బిజినెస్ హెడ్ వినయ్ శ్రీవాస్తవ పాల్గొన్నారు.



ఫియోనా రిఫైన్డ్ ఆయిల్ ఆవిష్కరణలో హీరోయిన్ లావణ్య త్రిపాఠి

నేత్రదానంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- మధురవాడ : జాతీయ నేత్రదాన వారోత్సవాలలో భాగంగా గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) ఆసుపత్రి, వైద్య కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం గీతం ఆవరణలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన జిమ్సర్ ప్రో వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ దేశంలో ఏటా లక్ష మందికి కార్నియా మార్పిడి ద్వారా దృష్టి తీసుకు రావలసి ఉండగా, కేవలం 25 వేల కార్నియా మార్పిడి మాత్రమే సాధ్యపడు తోంద న్నారు. నేత్రదానంపై అవగాహనతోనే దీన్ని అధిగమించడం సాధ్యమన్నారు. కార్యక్రమంలో జిమ్సర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.సందీప్, జిమ్సర్ నేత్ర విభాగాధిపతి డాక్టర్ వివిఎల్.నరసింహరావు, మెడికల్, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో విత్తనోత్పత్తి పథకం

ప్రజాశక్తి -పద్మనాభం: ఫౌండేషన్ వరి విత్తనాల సాగుకు మండలంలోని కృష్ణాపురం, పొట్నూరు రెండు గ్రామాలు ఎంపిక చేసినట్టు జిల్లా వ్యవసాయశాఖ అధికారి సిహెచ్ సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం కింద ఆయా గ్రామాల రైతులకు బిపిటి 5204 రకం వరి విత్తనాన్ని 60 బస్తాలు పంపిణీ చేశామన్నారు. ఆయా పొలాల్లో రైతులకు వ్యవసాయశాఖాపరంగా సాగుపై సలహాలు, సూచనలు అందించడంతోపాటు సాగు యాజమాన్యాన్ని సక్రమంగా అమలు చేయడం ద్వారా విత్తనాలను పండించి, వచ్చే ఖరీఫ్ సీజన్‌కు వాటిని వినియోగించేలా చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో భీమిలి ఎడిఎ బొడ్డేపల్లి విజయప్రసాద్, జి.కృష్ణ, పద్మనాభం ఎఒ బివి.చలం, సురేష్ పాల్గొన్నారు.

నీరుకొండకు ఘన సత్కారం

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్ ఐఎన్‌టియుసి అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు సేవలు మరువలేనివని యుటిలిటీ విభాగాధిపతి ఎన్.రవి అన్నారు. శుక్రవారం రామచంద్రరావు ఉద్యోగ విరమణ సందర్భంగా యుటిలిటీస్ విభాగంలో అధికారులు, ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ 35ఏళ్ల సర్వీసులో ఎటువంటి మచ్చలేకుండా సేవలు అందించిన నీరుకొండ, ప్లాంటులో ఎక్కడ సమస్య వచ్చినా వెంటనే స్పందించేవారన్నారు. ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ, కుటుంబం కంటే కర్మాగారానికి, అలాగే కార్మికులసంక్షేమానికి, యూనియన్ అభివృద్ధికి రామచంద్రరావు పనిచేశారన్నారు. కార్యక్రమంలో జిఎంలు శ్యామ్ బాబు, దేవదాసు, నాయకులు కారు రమణ, అవతారం కొమ్ము ప్రసాద్, నగేష్, ప్రభాకర రెడ్డి, ఎస్‌టినాయుడు, మోహన్ ,రాథోడ్, రమణమూర్తి, బి రామారావు, మిండి దేముడు, సంగ్రాన దేముడు, ఒబిసి, ఎస్‌సి,ఎస్‌టి అసోసియేషన్ల నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత



అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ సునీత

ములగాడ : జివిఎంసి 60వ వార్డు ఇందిరాకాలనీలో ఫ్రైడే డ్రైడేలో స్థానిక కార్పొరేటర్ డాక్టర్ పివి సురేష్ పాల్గొని మాట్లాడుతూ, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పరిసరాల శుభ్రతే ఆరోగ్యానికి భద్రత అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అనేక వ్యాధులకు కారణమైన దోమలు,వాటి లార్వాలను నియంత్రిం చేందుకు ప్రతిశుక్రవారం డ్రైడే పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్స్పెక్టర్ సతీష్, సిఐ మహాదేవి, ఎఎన్ఎమ్ కళ్యాణి, పలువురు మలేరియా విభాగం, సచివాలయ శానిటేషన్ విభాగ సిబ్బంది, నేతలు సత్తిబాబు, మేరీ పాల్గొన్నారు.

ఆనందపురం: దోమలను లార్వా దశలోనే నియంత్రిస్తే అనేక వ్యాధులు దరిచేరవని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ గంగునాయుడు పిలుపునిచ్చారు. ఇచ్ఛాపురం గ్రామంలో డ్రైడే ఫ్రైడేలో పాల్గొని ప్రజలకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ పి సాంబమూర్తి హెచ్ఎస్.కృష్ణ మోహన్, ఎంఎల్‌హెచ్‌పి స్వర్ణలత, ఎఎన్ఎం మెట్ట దేవి, ఆశ కార్యకర్త దేముడమ్మ పాల్గొన్నారు.

ఆరిలోవ :సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులపై ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ సూచించారు. జివిఎంసి శానటరీ విభాగం ఆధ్వర్యంలో 13వ వార్డు రామక్రిష్ణాపురంలో డ్రై డే ఫ్రైడేలో . కార్యక్రమంలో శానటరీ ఇన్స్పెక్టర్ రామారావు, సచివాలయ, మలేరియా సిబ్బంది,కాలనీ అధ్యక్షుడు బాబూరావు, గోవిందు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెం తదితర ప్రాంతాల్లో శుక్రవారం శానిటరీ ఇన్స్పెక్టర్ ఎన్ సూరిబాబు ఫ్రైడే డ్రైడేపై విస్తృత ప్రచారం చేపట్టారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యుసిడి సిఐ, సచివాలయం సిబ్బంది, మలేరియా సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కొండవాలు సమస్యలను పరిష్కరించండి



కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -గోపాలపట్నం :జివిఎంసి 90వ వార్డు లక్ష్మీ నగర్ కొండవాలు ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించాలని సిపిఎం గోపాలపట్నం డివిజన్ కమిటీ కార్యదర్శి బలివాడ వెంకటరావు, నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణకు వినతిపత్రం అందజేశారు. కొండవాలు ప్రాంతమైన లక్ష్మీనగర్‌బ్లాక్‌లో వర్షాకాలంలో రిటైనింగ్ వాల్స్ దెబ్బతిని కొండపై నుంచి వచ్చిన రాళ్ళ ప్రమాదకరంగా మారాయని ఆవేదన వ్యక్తంచేశారు. లక్ష్మీ నగర్‌లో సామాజిక భవనం, వీధిలైట్లు రోడ్డు డ్రైనేజీలు పూర్తిస్థాయిలో నిర్మించాలని కోరారు దీనిపై కార్పొరేటర్ బొమ్మిడి రమణ స్పందిస్తూ, దశలవారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం గోపాలపట్నం డివిజన్ కమిటీ నాయకులు కె రమణ ఎస్ సత్యవేణి ఎం శ్రీనివాసరావు, కె.తులసీరాణి పాల్గొన్నారు.

సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

ప్రజాశక్తి-ఆనందపురం: చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను షెడ్లను వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం వేములవలస, గంభీరం పంచాయతీలో సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూఉపాధి హామీ పథకంలో ఈ షెడ్లను పూర్తి చేసి, అక్టోబర్ 2 నాటికి అన్ని పంచాయతీల్లో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను వినియోగం లోకి తేవాలని సూచించారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి కెల్లా రామారావు మండలంలోని సంపద కేంద్రాలను స్థితిగతులను డిపిఒకు వివరించారు. వేములవలస, గంభీరం పంచాయతీ కార్యదర్శులు రామకృష్ణ నాయుడు, చలపతిరావు, వేములవలస ఉపసర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్‌రావు పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

రూ.35 లక్షల విలువ చేసే

340 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- ఆనందపురం: మండలంలోని చందక పంచాయతీ పరిధిలోని ఒక షెడ్డు సమీపంలో రూ.35 లక్షల విలువ చేసే 340కిలోల గంజాయిని టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు పట్టుకున్నారు. వివరాలివి.

ముందస్తుగా అందిన పక్కాస సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ భరత్, ఆనందపురం ఎస్ఐ సంతోష్ సిబ్బందితో శుక్రవారం వేకువజామున ముందే 3.30గంటల సమయంలో తనిఖీలు నిర్వహించారు. ఆనందపురం వైపు వస్తున్న రెండు ఆటోలను ఆపి తనిఖీలు చేయగా, ఆటోలలో 170 ప్యాకెట్లులలో 340 కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయితోపాటు రెండు ఆటోలు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు మహిళలతోపాటు మరో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నిందితుల్లో ఒడిశాకు చెందిన ఒక మహిళతోపాటు అల్లూరిజిల్లా పాడేరుకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. పోలీసుల విచారణలో గంజాయిని ఒడిశా మల్కనగిరి నుంచి విశాఖకు తెస్తున్నట్లు నిందితులు వెల్లడించారు. ముఖ్యమైన వ్యక్తి పరారీలో ఉన్నాడు. కేసును ఇన్‌ఛార్జి సిఐ శ్రీధర్ ఆధ్వర్యంలో ఎస్ఐ సంతోష్ దర్యాప్తు చేస్తున్నాడు. పట్టుకున్న గంజాయిని తహశీల్దార్ శ్యాంప్రసాద్‌కు అప్పగించారు.

చిట్టీల పేరుతో రూ.10 కోట్లకు కుచ్చుటోపీ

- పోలీసు స్టేషన్ వద్ద బాధితుల ఆందోళన

ప్రజాశక్తి- గాజువాక : చిట్టీల పేరుతో రూ.పదికోట్ల వరకు ప్రజల నుంచి వసూలు చేసిన వ్యక్తి పరారైన ఘటన గాజువాక వాంబే కాలనీలో చోటుచేసుకుంది. వివరాలివి. గాజువాక వాంబే కాలనీకి చెందిన ఎం పరుశురాం గతంలో అగ్రిగోల్డ్ ఏజెంట్‌గా పని చేశారు. ఆ పరిచయంతో వాంబే కాలనీ, ప్రియదర్శన్ కాలనీ, సంజీవ్‌నగర్ తదితర ఐదు కాలనీల్లో చిట్టీలు వేసేవాడు. ఆయా కాలనీల్లో ప్రజల నుంచి దాదాపు రూ. పది కోట్ల వరకు వసూలు చేసి, ప్రజలకు తిరిగి చెల్లించకుండా ఆ డబ్బుతో పరారయ్యాడు. ఈ మేరకు బాధితులంతా పోలీస్ స్టేషన్ ఎదుట శుక్రవారం ఆందోళనకు దిగారు. 50 మంది వరకు బాధితులు స్టేషనుకు వచ్చి ఫిర్యాదు చేశారు. దీనిపై గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దౌర్జన్యంగా ఇంటి ప్రహరీ కూల్చివేత



కూల్చిన ప్రహరీ వద్ద వికలాంగ బాధితులు

ప్రజాశక్తి -గాజువాక: జివిఎంసి 74వ వార్డు దయాల్‌నగర్‌లో గండి గంగరాజు అనే వికలాంగుని ఇంటి ప్రహరీ గోడను జివిఎంసి యంత్రాంగం ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించారని బాధితుడు ఆవేదన చెందుతున్నారు. అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన కార్పొరేటర్ స్థలానికి అడ్డు ఉందని కొన్నేళ్లుగా నివాసముంటున్న తన ఇంటి గోడను కార్పొరేటర్ ప్రోద్బలంతో ఇంటిలో ఎవరూ లేని సమయంలో, కనీసం ముందుస్తు సమాచారం ఇవ్వకుండా గోడను పూర్తిగా తొలగించారని బాధితుడు వాపోతున్నాడు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అంతేకాక ఇప్పటికే గోడ స్థలం ఇవ్వాలని తనపై ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన చెందుతున్నాడు. దీనిపై ఇప్పటికే నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశానని బాధితుడు గంగరాజు ఆందోళన చెందుతున్నాడు.

జూకు ఆర్ఒ ప్లాంట్ వితరణ

ప్రజాశక్తి- ఆరిలోవ : జూ పార్కు సందర్శకుల కోసం దివీస్ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రూ 29.20 లక్షల వ్యయంతో నాలుగు యూనిట్ల సామర్థ్యం కలిగిన ఆర్ఒ ప్లాంట్‌ను వితరణగా అందించింది. దీన్ని పిసిసిఎఫ్ఎస్ఎస్.శ్రీధర్, సిసిఎఫ్ శ్రీకంఠనాథ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. జూ క్యూరేటర్ డాక్టర్ నందని సలారియా, డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ జి.మంగమ్మ, దివీస్ ల్యాబొరేటరీ జిఎం.కోటేశ్వరరావు, మేనేజర్ డి.సురేష్, సీనియర్ లైజన్ కన్సల్టెంట్ వరహాల రెడ్డి పాల్గొన్నారు.

నిత్య విద్యార్థి చిరంజీవిరావు

నేడు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి-పద్మనాభం: ఉపాధ్యాయునిగా సర్వీసు మొత్తం పూర్తిచేసుకుని, ఈనెల 31న ఉద్యోగ విరమణ చేస్తున్న వెదుర్లవలస చిరంజీవిరావు నిత్యవిద్యార్థిగా నేటికీ విద్యాభ్యాసంపైనే మక్కువ చూపుతున్నారు. మండలంలోని రెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఇంగ్లీష్ అసిస్టెంట్‌గా ఉద్యోగ విరమణ చేస్తున్న చిరంజీవిరావు ప్రస్థానమంతా ఒకవైపు గురువుగా పాఠాలు బోధిస్తూనే, మరోవైపు విద్యార్థిగా విద్యాభ్యాసం చేస్తూ ఎన్నో డిగ్రీలు, పట్టాలు సాధించారు. ఆయనకు చదువంటే ఎంత ఇష్టమో చెప్పడానికి ఇటీవల ఎల్ఎల్‌బి కోర్సులో ప్రవేశానికి పరీక్షరాసి 8200 ర్యాంకు సాధించి, సీటుకోసం ఎదురుచూస్తుండడాన్ని బట్టి ఆయనకు చదువంటే ఎంత మక్కువో స్పష్టమౌతోంది.

బాల్యం, విద్యాభ్యాసం

విశాఖపట్నంలో వెదుర్లవలస సోమనాథం, అమ్మాజీ దంపతులకు 1962 ఆగస్టు 15న మూడవ సంతానంగా జన్మించిన చిరంజీవిరావు, పూర్వ విశాఖ జిల్లా గరివిడి మండలం గర్భాం గ్రామంలో అమ్మమ్మఇంటి వద్ద 1968-73 వరకు ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తిచేశారు. తండ్రి సోమనాథం విశాఖ షిప్‌యార్డులో ఉద్యోగరీత్యా ఉండడంతో 1974-76 వరకు గాజువాకలోని కణితి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల్లో 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు, తర్వాత కాకినాడ బదిలీ కావడంతో అక్కడ ఎంఎస్ఎన్ చార్టీ ఉన్నత పాఠశాలలో 1977-7 8లో 9.10 తరగతులు, 1980-82లో కాకినాడ పైడా అండాలమ్మ జూనియర్ కాలేజీలో ఇంటర్ పూర్తిచేశారు. మళ్లీ 1983-86 వరకు విశాఖపట్నం ఎయు దూర విద్యాకేంద్రంలో పబ్లిక్ అడ్మిని స్ట్రేషన్, పొలిటిక్స్, సోషియాలజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.

ఉద్యోగ ప్రస్థానం

1990లో ఉమ్మడి విశాఖ జిల్లా ముంచంగిపుట్టి మండలం.మాకవరం ప్రాథమిక పాఠశాలలో గ్రేడు-2 ఉపాధ్యాయునిగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించిన చిరంజీవిరావు, 1994 మార్చి వరకు అక్కడే పనిచేసారు. 1994 ఏప్రిల్ నుంచి 2002 అక్టోబర్ వరకు పద్మనాభం మండలం రెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రేడు-2 అసిస్టెంటుగా పనిచేసారు. 2002 జనవరి నెలలో అదే మండలంలోని బొత్సపేట ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయి, 2009 నవంబర్ వరకు అక్కడ సెకెండరీ గ్రేడ్ అసిస్టెంట్‌గా పనిచేశారు. 2009-17 వరకు పద్మనాభం మండలంలోని రేవిడి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల్లో ఇంగ్లీషు అసిస్టెంటుగా విధులు నిర్వర్తించిన చిరంజీవిరావు, 2017 ఆగస్టు ఒకటిన రెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు బదిలీ అయి, ఈనెల 31న అక్కడే ఉద్యోగ విరమణ చేస్తున్నారు. చదువు కోవడానికే పుట్టారా అన్నట్లు నేటికీ విద్యాభ్యాసంపైనే ఎంతో ఆసక్తి ఉన్న చిరంజీవిరావు, టిటిసి, సోషల్- ఇంగ్లీషు, సోషల్-తెలుగులో రెండు బిఇడిలు, తర్వాత ఎంఇడి పూర్తిచేశారు. ఇపుడు ఎల్ఎల్‌బి చదివేందుకు ఎంట్రన్స్ పరీక్షరాసి సీటు కోసం ఎదురుచూస్తున్నారు. 1991 జనవరిలో కాకినాడకు చెందిన ద్రాక్షాయణిని పెళ్లి చేసుకున్న చిరంజీవిరావుకు ఒక కుమార్తె ఉంది.



వెదుర్లవలస చిరంజీవిరావు

మంత్రి లోకేష్‌కు సమస్యలపై వినతి



లోకేష్‌కు సమస్యలను విన్నవిస్తున్న అంగన్వాడీ యూనియన్ నేతలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : గొల్లలపాలెం కెజిబివి సందర్శనకు వచ్చిన విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను పలువురు కలిసి సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.ఆనందపురం మండలం, కుసులవాడలోమైనింగ్ అనుమతులను రద్దు చేయాలని సిపిఎం జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి, కమిటీ సభ్యులు రవ్వ నరసింగరావు, ఎస్ అప్పల నాయుడు తదితరులు వినతిపత్రం అందజేశారు. కుసులవాడ భూముల్లో క్వార్ట్‌జైట్ తవ్వకాల అనుమతులకు ప్రజాభిప్రాయ సేకరణను స్థానిక ప్రజలు తీవ్రంగా వ్యతి రేకించారని వినతిలో పేర్కొన్నారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని, సమ్మె కాలంలో పెట్టిన కేసులన్నీ రద్దు చేయాలని, కనీసం మూడు నెలలు వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) భీమిలి ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షులు కె వెంకట లక్ష్మి, నాయకులు ఎం శ్రీదేవి, కె పద్మావతి , బి శాంతి కుమారి వినతిపత్రం అందజేశారు. సమగ్ర శిక్షలో సైట్ ఇంజనీర్లుగా 15 ఏళుగా పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎపిఇడబ్ల్యుఐడిసి (ఎస్సీ కార్పొరేషన్) లో ఖాళీగా ఉన్న 312 ఎఇ పోస్టుల్లో ఎఇ హొదా కల్పించాలని యూనియన్ సభ్యులు ఆనంద కుమార్, మహా లక్ష్మి, శేషారత్నం వినతి పత్రం అందజేశారు

యుపిఎస్ వద్దని యుటిఎఫ్ నిరసన



భీమిలిలో డిటికి వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ ప్రతినిధులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఏకీకత పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం భీమిలి లో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ప్లకార్డులతో పాత బస్‌స్టాండ్ నుంచి ప్రభుత్వాసుపత్రి మీదుగా తహాశీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. డిటి శ్రీనుబాబుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, డైట్ జంక్షన్ దరి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న పాత పెన్షన్ స్కీమ్‌ను కాకుండా, యుపిఎస్, జిపిఎస్, సిపిఎస్ దేన్నీ అంగీక రించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు అనకాపల్లి పైడిరాజు, జిల్లా కౌన్సిలర్లు ఎల్ఎ శ్రీనివాసరావు, యు రాంబాబు, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు మరగడ రామకృష్ణ, టి.రాజు పాల్గొన్నారు

పెందుర్తి :కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన యుపిఎస్‌ను వ్యతిరేకిస్తూ ఎపియుటిఎఫ్ పిలుపుమేరకు విశాఖపట్నం జిల్లా సహాధ్యక్షులు రొంగలి ఉమాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం పెందుర్తి తహాశీల్దార్ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ జిల్లా శాఖ నిరసన చేపట్టింది. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి ఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ అమలు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు ఉద్యమిస్తుంటే, కేంద్రం ఈనెల 22న ఆమోదించిన యుపిఎస్‌ను రుద్దాలని చూడడం దుర్మార్గమన్నారు. దీన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. కాంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ అమలు ఒక్కటే తమకు ఆమోదయోగ్య మన్నారు. అనంతరం పెందుర్తి డిప్యూటీ తహాశీల్దార్ వై.రంగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.అప్పారావు , పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎస్ నాగమణి, జిల్లా కార్యదర్శులు ఎన్.ప్రభాకరరావు, సిహెచ్ సత్యం, రాము ఉప్పాడ, వి.రామలక్ష్మి, చినగదిలి ప్రధాన కార్యదర్శి పద్మావతి, పెందుర్తి అధ్యక్షుడు అప్పుల రాము, ఇ.సత్యనారాయణ, ఎర్నాయుడు, అవతారం పాల్గొన్నారు.

రక్షణ రంగ కార్మికుల నిరసన



ఎన్ఎడి గేటు వద్ద నిరసన వ్యక్తంచేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి- కరాస: ఏకీకృత పెన్షన్ విధానం(యుపిఎస్) వద్దని, పాత పెన్షన్‌ను అమలు చేయాలని కోరుతూ దేశవ్యాప్త కార్మిక సంఘాల పిలుపు మేరకు శుక్రవారం ఎన్ఎడి ప్రధాన ద్వారం వద్ద నిరసన చేపట్టారు. అక్కడే యుపిఎస్‌కు వ్యతిరేకంగా బహిరంగ సభ నిర్వహించి, ఒపిఎస్ సాధనకు భవిష్యత్ కార్యాచరణ రూపొందించారు. ఈసందర్భంగా కాకాని నగర అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్ఎడి సిఇ యూనియన్ ప్రధాన కార్యదర్శి తల శ్రీనివాస్, డిఫెన్స్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు కార్మికుల ఐక్య పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.నిరసనలో యూనియన్ నాయకులు కార్యకర్తలు కార్మికులు పాల్గొన్నారు.

ములగాడ : యుపిఎస్‌ను రద్దుచేసి, ఒపిఎస్ అమలు చేయాలని కోరుతూ డిఫెన్స్ కోఆర్డినేషన్ కమిటీ పిలుపుమేరకు నేవల్ సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నేవల్ డాక్‌యార్డ్ విజయనగర్ గేటు వద్ద నిరసన చేపట్టారు. రెండురోజుల ఆందోళనలో భాగంగా శుక్రవారం తొలిరోజున యూనియన్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ఆందోళనలో ప్రధాన కార్యదర్శి జి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన యుపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్ వెంటనే అమలు చేయాలని, ఎనిమిదవ వేతన సంఘం కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌సిఇ యూనియన్ ఆఫీస్ బేరర్స్, వర్క్స్ కమిటీ మెంబర్లు, జెసిఎం మెంబర్స్, సొసైటీ డైరెక్టర్లు ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి హామీ



ఆందోళన చేస్తున్న స్టీల్ కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారం కొరకు ఉక్కు యాజమాన్యం హామీ ఇచ్చిందని స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ సిఐటియు ఉపాధ్యక్షులు. జిల్లా అధ్యక్షులు కె ఎం శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సమస్యలు పరిష్కారానికి యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఇడి వర్క్స్ కార్యాలయం ముట్టడి ఆందోళనలో మాట్లాడుతూ. బయోమెట్రిక్ హాజరుతో ఇబ్బందులు దృష్ట్యా పని చేసిన రోజులకు జీతాలు చెల్లిస్తామని. సిజిఎం వర్క్స్ ఇన్‌ఛార్జి యు శ్రీధర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. పనిదినాలు కుదింపు, కార్మికులను తగ్గించే విషయం అలాగే ఇతర సమస్యలను ఉన్నత యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇది కార్మికుల పోరాట ఫలితమని, ఇచ్చిన హామీని యాజమాన్యం అమలు చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సిజిఎం వర్క్స్ ఇంచార్జ్‌శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ అధ్యక్షుడు జి శ్రీనివాసరావు అధ్యక్షత నిర్వహించిన ఆందోళనలో నాయకులు ఒవి.రావు, నమ్మి రమణ, కెపి.సుబ్రమణ్యం, మసేను,శశిభూషణ్, సోమేష్, వరహాలు, ఎన్.కృష్ణ, బి కన్నబాబు, కె సత్యవతి పాల్గొన్నారు.

నేడు నీరుకొండ రామచంద్రరావు ఉద్యోగ విరమణ



నీరుకొండ రామచంద్రరావు, సుశీల దంపతులు

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టియుసి అధ్యక్షులు నీరుకొండ రామచంద్రరావు ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. 1964 ఆగస్టు 15, అనకాపల్లి జిల్లా, కశింకోట మండలం, ఎఎస్ పేటలో జన్మించిన రామచంద్రరావు, 5వ తరగతి వరకు పుట్టిన ఊరిలోనే చదివారు. టెన్త్ వరకు తాళ్లపాలెం జెడ్‌పి ఉన్నతపాఠశాలలో విద్యనభ్యసించిన ఆయన, 1980 మార్చిలో గాజువాకలో బావ గారింటికి వచ్చారు. 1984-86లో నగరంలోని ఓల్డ్ ఐటిఐలో ఐటిఐ, తర్వాత డిగ్రీ పూర్తి చేశారు. 1987 జూలైలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జూనియర్ ట్రైనీగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి, 37 ఏళ్ల సర్వీస్ పూర్తి చేశారు. చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలున్న రామచంద్రరావు, పాఠశాల స్థాయిలో క్లాస్‌లీడర్‌గా, 1983లో ద్రోణంరాజు సత్యనారాయణ, గుడివాడ గురునాథరావు ప్రోద్బలంతో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 1984లో ఉక్కు నిర్వాసిత సమస్యలపై పోరాడుతూ, బాలచెరువు ఫైరింగ్‌ఉద్యమంలో పాల్గొన్నారు. స్టీల్ ప్లాంట్‌లో చేరిన నాటి నుంచి ఉద్యగవిరమణ వరకు ఐఎన్‌టియుసిలో జనరల్ సెక్రటరీగా, అసిస్టెంట్ సెక్రటరీగా, డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా, ప్రస్తుత అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. కార్మికసంఘ నాయకుడిగా ప్రమోషను ఇన్సెంటివ్ స్కీమ్స్, జిఒ పాలసీలపై పోరాడి, కార్మికులకు మెరుగైన సౌకర్యాలు అందించారు.ఐఎన్‌టియుసి హయాంలో ఉద్యోగ విరమణ పొందే సమయంలో కార్మికులకు గోల్డ్, సిల్వర్‌కాయిన్స్ వచ్చేవన్నారు. ప్రస్తుత స్టీల్ ఐఎన్‌టియుసి తోపాటు జిల్లా యూనియన్ ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షునిగా, అఖిల భారత జనరల్ కౌన్సిల్ మెంబర్‌గా, ఐఎన్‌టియుసిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితు లుగా ఉన్నానన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగంతోపాటు సెజ్ ఫార్మా కార్మికుల సమస్యలపైనా, ఆటోనగర్‌లోకి కార్మికుల సమస్యలపై పోరాడి పరిష్కరించానన్నారు. 1993లో సీఎస్ఎఫ్ జ గొడవల్లో ఏడు రోజులు ప్లాంట్‌ను స్తంభింపజేసే ఆందోళనలో పాల్గొన్న రామచంద్రరావు, పూర్తిస్థాయిలో ట్రేడ్ యూనియన్‌లో బాధ్యతలు నిర్వర్తించారు. భవిష్యత్‌లోనూ పూర్తిస్థాయిలో కార్మికులు, ఉద్యోగులు, ప్రజా సమస్యలపై పోరాడతానంటున్న రామచంద్రరావుకు రాష్ట్ర శ్రమశక్తి, ఉత్తమ కార్మిక సమాజ్, ఉగాది పురస్కార్, ఆంధ్ర కార్మికరత్నం, అమెరికన్ యూనివర్సిటీలో డాక్టరేట్ వంటి ఎన్నో అవార్డులు, రివార్డులు వరించాయి. రామచంద్రరావుకు భార్య సుశీల, యశోదర, లిఖిత అనే ఇద్దరు కుమార్తెలున్నారు.

నేడు సింహాచలం మాస్టారి ఉద్యోగ విరమణ



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న సింహాచలం మాస్టారు (ఫైల్

ప్రజాశక్తి- భీమునిపట్నం :జివిఎంసి మూడో వార్డు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెట్టి సింహాచలం ఈ నెల 31న ఉద్యోగ విరమణ పొంద నున్నారు. ఉత్తమ గురువుగా, సమాజ హితులుగా, విద్యార్థులకు సన్నిహి తులుగా ఉంటూ ఉద్యోగం, వృత్తిధర్మాన్ని క్రమశిక్షణ అంకితభావంతో నిర్వర్తించి, ఎన్నో అవార్డులు, ప్రశంసలు సొంతం చేసుకున్న సింహాచలం రిటైర్ కానున్నారు.

ఉద్యోగ ప్రస్థానం ఇలా...

1985 ఆగస్టు 24న ఉపాధ్యాయ వృత్తిలో అడుగిడిన సింహాచలం, ప్రస్తుత జివిఎంసి ఒకటో జోన్ వలంద పేట, విల్సన్ పేట, సంతపేట ప్రాథమిక పాఠశాలల్లోను, రెండవ వార్డు యుపి పాఠశాల, మూడవ వార్డు ఎంఎఫ్‌సి యుపి పాఠశాలల్లో, రాయిపాలెం, పిఎన్ఎం, సంతపేట, భీమిలి ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయునిగా, హెచ్ఎంగా గ్రేడ్-2గెజిటెడ్ హెచ్ఎంగా వివిధ హోదాల్లో పనిచేశారు.

వృత్తి ధర్మంతోపాటు సేవాభావం

పనిచేసిన ప్రతి పాఠశాలలోనూ విద్యార్థుల ఉన్నతికి సింహాచలం మాస్టారు కృషి చేశారు. పేద విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లింపు, అనాధలకు బట్టలు, ఫుడ్ ప్యాకెట్లు, దుప్పట్లు అందజేస్తూ సేవా భావాన్ని చాటుకున్నారు. తల్లి సుందరమ్మ, తండ్రి రామన్న స్ఫూర్తితో అన్నార్తులకు చేదోడుగా ఉన్న సింహాచలం, భవిష్యత్‌లో తల్లిదండ్రుల పేరిట స్థాపించిన సుందరమ్మ రామన్న చెట్టి (ఎస్ఆర్‌సి) వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా అణగారిన ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ధృడ సంకల్పంతో ఉన్నారు.

విద్యాభ్యాసం ఇలా...

ఉమ్మడి విశాఖ జిల్లా,ముంచంగిపుట్టు మండలం, సుజనకోటలో జన్మించిన సింహాచలం స్వగ్రామంలోనే ఒకటి నుంచి 5 వ తరగతి వరకు ఆరు నుంచి 9వ తరగతి వరకు పెదబయలు జెడ్‌పిహైస్కూల్‌లోనూ, అరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి, పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, విశాఖ ఎవిఎన్ కళాశాలలో డిగ్రీ, ఎయులో ఎంఎ (ఎకనామిక్స్), అనంతపురం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో ఎంఎ(ఇంగ్లీష్), ఎయులో ఎంఇడి చదివారు.

శిక్షణ పొందిన చోటనే ఉపాధ్యాయునిగా....

1983 -84లో స్థానిక ప్రభుత్వ డైట్‌లో ఉపాధ్యాయ శిక్షణ పొందిన సింహాచలం, భీమిలిలోనే 1985లో ఉపాధ్యాయ వృత్తిలో అడుగిడి, ఇక్కడే ఉద్యోగ విరమణ చేస్తున్నారు.

ఎన్నో అవార్డులు, ప్రశంసలు

39 ఏళ్ల ఉపాధ్యాయ ఉద్యోగ ప్రస్థానంలో ఎందరో ప్రముఖుల ప్రశంసలు, మరెన్నో అవార్డులు సింహాచలం మాస్టారు అందుకున్నారు. 2016, 2018, 2019లో ఉమ్మడి విశాఖ జిల్లాలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు. 'టీచింగ్ అండ్ సోషల్ సర్వీస్' ప్రామాణికంగా తీసుకుని మదర్ థెరీసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ 'గురు బ్రహ్మ' రాష్ట్రస్థాయి అవార్డు, అబ్దుల్ కలాం మెమోరియల్ ఆర్గనైజేషన్ 'విద్యా భూషణ్' రాష్ట్రస్థాయి అవార్డు, యోగాసనాల్లో ప్రతిభకు 1980లో అప్పటి సీఎం మర్రి చెన్నారెడ్డితో ప్రశంసలు అందుకున్నారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుల విభాగంలో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ ప్రథమ అవార్డు స్వీకరించారు. పలువురి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, విద్యాశాఖ ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులతో అభినందనలు, సత్కారాలు వంటికి సింహాచలం మాస్టారి ఖాతాలో లెక్కలేనన్ని ఉన్నాయి. ఈత, క్యారమ్స్, బాడ్మింటన్ వంటి ఆటలలో ప్రావీణ్యం ఉన్న సింహాచలం విద్యార్థు లను చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సాహించేవారు.

తండ్రి బాటలోనే...

సింహాచలం మాస్టారి కుమార్తె ప్రియాంక, కుమారులు దుర్గాశంకర వరప్రసాద్, అశోక్ చక్రవర్తి తండ్రికి తగ్గట్టుగా ఉన్నత చదువులు చదివి, ఉన్నతోద్యోగాల్లో నిలదొక్కుకున్నారు. తండ్రి బాటలోనే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ


ప్రజాశక్తి - పరవాడ

పరవాడ ఫార్మాసిటీ, అచ్చుతాపురం సెజ్‌లో ఉన్న అన్ని పరిశ్రమల్లో తక్షణమే సేఫ్టీ ఆడిట్ నిర్వహించి కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు ముద్రించిన గోడపత్రికను శుక్రవారం పరవాడ ఫార్మాసిటీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎసెన్షియా, సెనర్జిన్ కంపెనీల్లో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. 17 మంది ప్రాణాలను బలిగొన్న ఎసెన్షియా, ముగ్గురు కార్మికులు మృతికి కారణమైన సెనర్జిన్ యాజమాన్యాలను నేటికీ అరెస్టు చేయకపోవడం అన్యాయమన్నారు. వరుస ప్రమాదాలపై తనిఖీలు లేకపోవడం వల్ల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కార్మికులు క్షణక్షణం భయాందోళన చెందుతూ విధులు నిర్వహించాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎస్ఈజెడ్, ఫార్మాసిటీ ప్రాంతంలో వేలాదిమంది కార్మికులు పనిచేస్తున్నా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లేకపోవడంతో విశాఖపట్నం వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని, ఈ లోగానే కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో బర్నర్ వార్డుతో కూడిన 200 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ డిపార్ట్మెంట్ అధికారులు, పరిశ్రమల తనిఖీ అధికారులు భద్రతా ప్రమాణాలు మెరుగునకు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన చేపడతామని గనిశెట్టి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే అప్పలరాజు, జి చిట్టిబాబు, జి ముసలి నాయుడు, రమణ, సత్తిబాబు, చిలుకు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నేత గనిశెట్టి, కార్మికులు

'ఎసెన్షియా' మృతులకు కొవ్వొత్తులతో నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న సిఐటియు నేతలు, కార్మికులు

ప్రజాశక్తి- అచ్యుతాపురం

అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లోని ఎసెన్షియా పరిశ్రమంలో ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందిన 17 మంది కార్మికులకు శుక్రవారం రాత్రి అచ్యుతాపురంలో సిఐటియు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శనతో నివాళు లర్పించారు. మృతులకు ప్రగాఢ సంతాపం, వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము మాట్లాడుతూ 17 మంది ప్రాణాలను బలిగొన్న పరిశ్రమ యాజమాన్యాన్ని అరెస్టు చేయకపోవడం అన్యాయమన్నారు. యాజమాన్యాలకు రాయితీలు కల్పిస్తూ కార్మిక చట్టాలను అమలు చేయకపోవడం వల్లే తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. కార్మికుల విధులకు రావాలంటే క్షణక్షణం భయాందోళన చెందుతున్నారన్నారు. పరిశ్రమలలో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని, 200 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కె.సోమునాయుడు, నాయకులు రమణ, చంటి, రామానాయుడు, నరసింగరావు, నానాజీ, ఆర్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ఎపి శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం జగన్నాథ్ థియేటర్ వద్ద గల రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి 11వ సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ (పురుషులు, మహిళలు) వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా మంచి ఆరోగ్యంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా ఉంటాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రోత్సాహాన్ని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయకుమార్, క్రీడా అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ జాగిలాలతో గంజాయి, మాదక ద్రవ్యాల తనిఖీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు పార్సిల్ సర్వీస్‌లు ద్వారా అక్రమ రవాణాను అరికట్టేందుకు అనకాపల్లి జిల్లా పోలీసులు పోలీస్ జాగిలాలు ద్వారా విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎస్పీ ఎం.దీపిక ఆదేశాల మేరకు అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, పరవాడ తదితర ప్రదేశాలలో ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ, ప్రైవేట్ పార్సిల్ సర్వీస్‌లు వద్ద గంజాయి, ఇతర మత్తు పదార్థాలను వాసనను గ్రహించి పసికట్టే పోలీస్ జాగిలాలు ద్వారా పటిష్ట తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, చెక్ పోస్ట్‌ల వద్ద ఇతర రవాణా మార్గాల గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ దీపిక తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత అక్రమ సంపాదనకు ఆశపడి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని హితవుపలికారు. గంజాయిని సేవించేవారు మానసికంగా శారీరకంగా దుష్పరిణామాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. మత్తులో నేరాలకు పాల్పడే అవకాశం ఉంటుందన్నారు. గంజాయి కేసుల్లో పట్టుబడితే వారికి 10 నుండి 20 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని, కుటుంబాలు విచ్ఛిన్న మవుతాయని తెలిపారు. యువత ముఖ్యంగా విద్యార్థులు ఇటువంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా కష్టపడి చదువుకోవడం, క్రీడలలో కెరీర్ నిర్మించుకుని ఉద్యోగం సంపాదించి కుటుంబానికి ఆసరా కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి టౌన్ ఎస్సై అలీ షరీఫ్, చోడవరం ఎస్సై శేఖరం, నర్సీపట్నం టౌన్ ఎస్సై సుధాకర్, పరవాడ పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నోట్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండల కేంద్రం కే కోటపాడు ఎస్సీ బాలికల వసతి గృహం విద్యార్థినులకు శుక్రవారం నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ట్రస్ట్ చైర్మన్, రిటైర్డ్ జస్టిస్ ఎన్ సన్యాసిరావు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాలురు కంటే బాలికలు ముందంజలో ఉండాలని అందుకు చదువు ఒక్కటే ముఖ్యమని తెలిపారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్న ఉద్దేశంతో తమ ట్రస్ట్ తరపున పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందిస్తున్నట్లు చెప్పారు. స్థానిక సబ్ రిజిస్టర్ బంగారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ స్త్రీ వివక్షను నిర్మూలించుటకు ఎంతో కృషి చేశారని, ఆయన పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేయడం ఆనందించ దగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ ఎన్ బెనర్జీ, హెచ్‌డబ్ల్యుఓ ఎం నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


నోట్ పుస్తకాలు అందిస్తున్న దృశ్యం


పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న హెల్త్ సూపర్ వైజర్ తదితరులు

డెంగీ కేసు నమోదుతో అప్రమత్తం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట గ్రామ శివారు నేతవానిపాలెం గ్రామంలో చల్లా నాగరాజు ఏభూష అనే వ్యక్తికి డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ కావడంతో బుచ్చయ్యపేట పిహెచ్సి వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. చల్లా నాగరాజు ఏభూషకు కొద్ది రోజుల క్రితం జ్వరం రావడంతో కుటుంబీకులు విశాఖ కేజీహెచ్ తరలించారు. గురువారం డెంగ్యూగా నిర్ధారణ కావడంతో శుక్రవారం హెల్త్ సూపర్వైజర్ త్రిమూర్తులు తదితరులు నేతవానిపాలెం గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి తిరిగి గోతాలు, కుండీలు తదితర వాటిలో మీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. వర్షాకాలం కావడం ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక మండపాలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు పొందాలి


సిఐ విజయ్‌కుమార్

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు రాబోయే వినాయక ఉత్సవాలకు మండపాలు పెట్టాలంటే ప్రతి ఒక్కరూ సింగిల్ విండో ఆన్లైన్ యాప్ ద్వారా అనుమతులు పొందాలని పట్టణ సిఐ విజయ్ కుమార్ తెలిపారు. సింగిల్ విండో యాప్ https://ganeshutsa.appolice.gov.in లేదా 7995095800 నెంబర్ ద్వారా రిజిస్ట్రేషన్ అయ్యి పర్మిషన్ తీసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరు దీనిని గమనించి నిబంధనల పాటించాలని, లేదంటే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

సుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో మూసివేసిన తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరించి, తెరిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం శుక్రవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రధాన పంటగా వుండే చెరుకు సాగు నేడు తగ్గిపోతున్న తరుణంలో సుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి చెరుకు పండించే రైతులకు భరోసా కల్పించాలని కోరారు. జిల్లాలో వరి పంట తరువాత రెండో అతి ప్రధాన పంటగా వున్న చెరుకు సాగు తగ్గడం ఆందోళన కలిగిస్తుందన్నారు. తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీల క్రషింగ్ నిలిపివేయడంతో చెరుకు సాగుపై రైతుల ఆసక్తి సన్నగిల్లిందని పేర్కొన్నారు. దీంతో జిల్లాలో ఈ ఏడాది తుమ్మపాల, తాండవ, ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీల క్రషింగ్ ప్రభుత్వం నిలిపివేయడంతో చెరకు సాగు గణనీయంగా పడిపోయిందని తెలిపారు. ఈ ఏడాది 47 వేల ఎకరాల్లో సాధారణ సాగు విస్తీర్ణానికి ఇప్పటివరకు 13,735 ఎకరాల్లో రైతులు చెరకు సాగు చేశారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మూడు సుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరించి పునరుద్ధరించాలని కోరారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరించి క్రషింగ్ సామర్థ్యాన్ని పెంచాలని, రైతుల పెట్టుబడులకు అనుగుణంగా మద్దతు ధర, ప్రోత్సాహక ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. క్రషింగ్ నిలిపివేసిన మూడు సుగర్ ఫ్యాక్టరీల పరిధిలో చెరుకు సాగు తగ్గిందని, ఆహార పంటలు పండించాల్సిన పొలాల్లో ఆహారేతర పంటలు పండించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఫ్యాక్టరీలను తెరిపించి రైతులను ఆదుకుంటామని గతంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు.

ఆధారాలు లేని వార్తలు ప్రచురిస్తే సహించేది లేదు

ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

ప్రజాశక్తి-అచ్యుతాపురం

తనపై ఎటువంటి ఆధారాలు లేని వార్తలు ప్రచురించినట్లయితే సహించేది లేదని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కొంతమంది పత్రిక విలేకరులు కావాలని నిరాధారమైన వార్తలు ప్రచురించి తనను సమాజంలో కించపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎవరికైనా దమ్ముంటే రాసిన రాతలకు ఆధారాలు చూపించాలన్నారు. లేనిపక్షంలో రాబోయే కాలంలో వారంతటివారే క్షమాపణలు చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఫ్యాక్టరీల వద్దకు వెళ్లి మొక్కలు నాటండి, పర్యావరణాన్ని పరిరక్షించండి, స్థానిక ప్రజలకు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని పరిశ్రమల ప్రతినిధులతో చెప్పడం జరుగుతుందని తెలిపారు. ప్రజాహితం కొరకు కంపెనీలతో మాట్లాడితే తప్పుడుగా అర్థం చేసుకొని తనపై ఫిర్యాదులు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. 16 సంవత్సరాలుగ ఎలమంచిలి నియోజకవర్గంలో నిస్వార్థమైన సేవలు అందిస్తున్నానని గుర్తు చేశారు. సెప్టెంబర్ 2న ఉప పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బి రాందాస్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షులు ఆడారి మంజు తదితరులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్



మాట్లాడుతున్న డాక్టర్ సతీష్‌కుమార్

గ్రంథాలయ 13వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో ఉన్న "పెతకం శెట్టి జోగి నాయుడు మాస్టారు" గ్రంథాలయం 13వ వార్షికోత్సవ వేడుకలు, కీర్తిశేషులు పెతకం శెట్టి బాబురావు 85వ జయంతి వేడుకలు గురువారం రాత్రి జరిగాయి. ఇందులో భాగంగా నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు, 10వ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సిద్ధనాతి చాందిని, పిల్ల సరయులకు నగదు బహుమతులను డాక్టర్ పెతకం శెట్టి సతీష్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ గౌరవాధ్యక్షులు పెతకంశెట్టి రామజోగినాయుడు, సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, కోయిలాడ దశావతారం, బొడ్డేడ సత్యనారాయణ, మల్ల రాజేష్, మల్ల వరాహనరసింగరావు, మల్ల సేసు, బీసెట్టి రామారావు, కాండ్రేగుల నూక అప్పారావు, పెతకం శెట్టి లీలాభాస్కర్, మల్ల కనుమనాయుడు పాల్గొన్నారు.

పవన్ పుట్టినరోజు వేడుకలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- మునగపాక : సెప్టెంబర్ 2న జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలను జయప్రదం చేయాలని మాజీ జడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం మండల పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2వ తేదీ సోమవారం మండలంలో ప్రతి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల జనసేన నాయకులు టెక్కలి పరశురాం, కె చంద్రమోహన్, పాలి పిన్ని రాము, మొల్లేటి ఆనంద్, వైస్ ఎంపీపీ చెందాడ దేవి, ఏవి సత్యనారాయణ, ఎల్లపు భాస్కరరావు, పాలిపిని శ్రీనివాసరావు, బొడ్డేడ అప్పలనాయుడు, ఆడారి శ్రీకాంత్, అల్లవరపు రమణ బాబు, సూరిశెట్టి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత బ్యుటీషియన్ కోర్సు

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకంలో భాగంగా ఉచిత బ్యుటిషియన్ కోర్సు నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ ఐవిఎస్ఎస్ శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎనిమిదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకున్న మహిళలు దీనికి అర్హులన్నారు. ఆసక్తిగల మహిళలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు 7013342667 నెంబర్‌ని సంప్రదించాలని కోరారు.

పేదల ఇళ్లను కూల్చడం సరికాదు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం మెయిన్ రోడ్‌లో పేదలు నివాసముంటున్న ఇళ్లను పంచాయతీ అధికారులు కూల్చడం దారుణమని జనసేన నియోజకవర్గ ఇన్చార్జి పివిఎస్ఎన్ రాజు అన్నారు. శుక్రవారం ఆయన బాధితులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారి భవంతి నిర్మించుకోవడానికి అడ్డుగా ఉన్న పేదల ఇంటిని తొలగించినట్లు తెలుస్తుందని తెలిపారు. బాధితులకు జనసేన పార్టీ అండగా ఉండి సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం చేస్తుందని రాజు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, బిజెపి నాయకులు కందర్ప రమణమూర్తి, మూల నాయుడు, అల్లం రామ అప్పారావు, కర్రి రమేష్ ఇతరులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న పివిఎస్ఎన్.రాజు

మొక్కలు నాటి, సంరక్షించాలి

- రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యపాత్రుడు

- వాడవాడలా వన మహోత్సవం



అనకాపల్లి ఎఎంసిలో మొక్కలు నాటుతున్న రవికిరణ్ తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రతి ఒక్కరూ కనీసం మూడు మొక్కలను నాటాలని, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యపాత్రుడు అన్నారు. వనమహోత్సవం-2024 కార్యక్రమం సందర్భంగా శుక్రవారం అనకాపల్లి డాక్టర్ ఎన్టీ రామారావు మార్కెట్ యార్డ్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని అయ్యపాత్రుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేసి, ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ గతంలో తాను అటవీ మంత్రిగా ఉన్న సమయంలో రెడ్ క్రాస్, గ్రీన్ క్రాప్, ఎన్సీసీ వంటి విద్యార్థి విభాగాలతో ప్రత్యేకంగా ఒకే రోజు లక్షల మొక్కలు నాటేలా చర్యలు తీసుకున్నట్లు గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ అన్ని స్కూళ్లలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి, యలమంచిలి ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయ్ కుమార్, డిఎఫ్ఓ జగన్నాథ్ సింగ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎఎంసిలో..

వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ యార్డులో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారి రవి కిరణ్ మాట్లాడుతూ మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షిస్తేనే అటవీ సంపద పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి కార్యదర్శి శకుంతల, సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి ఆర్ఎఆర్ఎస్‌లో సహ సంచాలకులు డాక్టర్ ముకుందరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ చారుమతి, జి కుసుమ, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణ, గ్రామ సచివాలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.అప్పలరాజు, మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధి హామీ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని ఐతంపూడి గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా మొక్కలను ఎంపీడీవో సువర్ణ రాజు ఆధ్వర్యాన నాటారు. పెద్దమదిన పాఠశాలలో మొక్కలను స్థానిక సర్పంచ్ కె.వీరునాయుడు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దడి నాయుడు, ఎంపీటీసీ దేవర అప్పారావు, ఈసీ సతీష్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో ఎంపిడిఒ రమేష్ నాయుడు ఆధ్వర్యాన మునగ, జామ, సపోటా తదితర 30 మొక్కలను నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎన్ రామకృష్ణ, ఎంఇఒలు లక్ష్మణరావు, మూర్తి, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లి : తెనుగుపూడి గురుకుల పాఠశాలలో ఎంపీడీవో సిహెచ్ చంద్రశేఖరరావు ఆధ్వర్యాన మొక్కలు నాటారు. విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపిడి బి.శ్రీనివాస్, ఏపీవో డి చంద్రకళ, విపివి త్రినాథ్, ప్రిన్సిపాల్ డి. జయప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ పి.రఘు, మాజీ ఎంపిటిసి పెంటకోట అప్పలనాయుడు, టిడిపి నాయకులు సామల నాయుడు, తేడా చిన్నారావు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెం, జామాదులపాలెం గ్రామాల్లో మండల స్పెషల్ ఆఫీసర్ ఎం రోజారాణి, ఎంపీడీవో వి రవికుమార్ శుక్రవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఓ శివ, సాంకేతి సహాయకులు కుమారి, శివాని, సత్యనారాయణ పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ అన్నపూర్ణ ఆధ్వర్యాన మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఇ.నరసింహ మూర్తి, జె.సుధీర్, కె.విజయ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్ చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నర్సీపట్నం అటవీశాఖ రేంజర్ లక్ష్మీనర్స్, మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, 28వ వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్, నర్సీపట్నం జనసేన పార్టీ టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, ఏపీఓ నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట : ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని తహసీల్దార్ మహేశ్వరరావు, చోడవరం ఫారెస్ట్ రెంజర్ రవి వర్మ కోరారు. రావికమతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటారు. టి.అర్జాపురంలో సిఆర్‌పి గుంటూరు రామారావు ఆధ్వర్యంలో డోలవాణిపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాలలో చోడవరం ఫారెస్ట్ డిప్యూటీ రెంజర్ రాజగోపాలరావు, హెచ్ఎం మల్లికార్జునరావు, యస్ఎంసి చైర్మన్ అప్పారావు, సర్పంచ్ మోదీ నాయుడు, ఎంపీటీసీ గెంజి సూర్యనారాయణ, జన సేన పార్టీ నాయకులు శ్రీనివాస్, సూరిబాబు పాల్గొన్నారు.

నక్కపల్లి : స్థానిక కస్తూర్బా బాలిక విద్యాలయం ఆవరణలో మొక్కలను సర్పంచ్ జయ రత్నకుమారి, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, ఉప సర్పంచ్ రాజు, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ నాటారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈఓ నరేష్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం ప్రత్యేక అధికారి సలీమా పాల్గొన్నారు.

చీడికాడ : మండలంలోని కోణం గ్రామ పంచాయతీ గురుకుల బాలికల ఉన్నత పాఠశాల, సోషల్ వెల్ఫేర్ బాలురు స్కూల్‌లో మొక్కలు నాటారు. ఎంపీడీఓ జయప్రకాశరావు, గ్రామ సర్పంచ్ సలుగు ఈశ్వరమ్మ, ఎంపీటీసీ చిన్నమ్మలు స్కూల్ కమిటీ చైర్మన్ గాలి దయారావు పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని కృష్ణదేవిపేట అటవీ శాఖ రేంజ్ అధికారి సుంకర వెంకట్రావు ఆధ్వర్యంలో ఏఎల్ పురం హైస్కూల్‌లో మొక్కలు నాటారు.జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్ చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర, డీఆర్వో సత్యనారాయణ, సెక్షన్ అధికారి



ప్రతిజ్ఞ చేస్తున్న స్పీకర్ అయ్యన్న, కలెక్టర్, ఎమ్మెల్యేలు

లక్ష్మణ్, జనసేన పార్టీ నాయకులు రేగుబళ్ల శివ, సలాదుల ప్రసాద్, దంగుల రమేష్, హెచ్ఎం నాగభూషణం పాల్గొన్నారు.

గోపాలపట్నం : 92వ వార్డు గోపాలపట్నం బాలికల పాఠశాలలో వనం మనం కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, జివిఎంసి కమిషనర్ సంపత్‌కుమార్ పాల్గొని మొక్కలు నాటారు. అనంతరంగోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానాన్ని, ఇండోర్ స్టేడియంను పరిశీలించారు.కార్పొరేటర్లు దాడి వెంకట రమేష్ , బొమ్మిడి రమణ, జెడ్‌సి, జివిఎంసి అధికారులు, నాయకులు బాలసుబ్రహ్మణ్యం, నరిపిన్ని సత్తిరాజు, మూర్తి పట్నాయక్ , బొడ్డేటి విజయ్, నరవ అనూష, యలమంచిలి ప్రసాద్, కొల్లి అప్పారావు , ప్రదీప్, పెప్సీ రమణ, డాడీ సురేష్, జయశంకర్, అలజంగి శ్రీను, కొండ పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని తర్లువాడ గ్రామంలో వనం మనం కార్యక్రమాన్ని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు ప్రారంభించారు. తర్లువాడలో రోడ్డు పక్కన పాఠశాల, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో 400 మొక్కలు నాటనున్నట్లు వెల్లడించారు. స్థానిక సర్పంచ్ బిఆర్‌బి నాయుడు ఆధ్వర్యంలో ఎంపిడిఒ అడపా లవరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, తాట్రాజు అప్పారావు, మజ్జి రమేష్ నాయుడు, బాయిన ఆనంద్ పాల్గొన్నారు.

ఆరిలోవ : వనం మనం కార్యక్రమంలో భాగంగా జివిఎంసి శానటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు ఆధ్వర్యంలో 12వ వార్డు మయూర్‌నగర్, వివేకానంద పార్కులో శుక్రవారం మొక్కలు నాటారు. వార్డు టిడిపి అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు, టిడిపి నాయకులు పోలారావు, ఒమ్మి రాజు పాల్గొన్నారు.

తగరపువలస : భీమిలి మండలం, తాటితూరు జెడ్‌పి హైస్కూల్ అవరణలో వన మహోత్సవంలో భాగంగా పాఠశాల యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో హెచ్ఎం, డి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు టిఎస్‌వి ప్రసాద రావు, మురళి, ఎస్ఎంసి అధ్యక్షులు బాబు మొక్కలు నాటారు.

ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలలో శుక్రవారం వన మహోత్సవం జూ అధికారులు, సిబ్బంది, ఎస్‌వి.కృష్ణా కాలేజీ విద్యార్థులు, పాల్గొని ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటారు. పర్యావరణాన్ని పరిరక్షించాలని విద్యార్థులు, జూ సిబ్బంది ప్రతిజ్ఞ చేయించారు. జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా, జూ పరిపాలనా విభాగం అధికారిణి ఉమాదేవి, అసిస్టెంట్ క్యూరేటర్స్ గోపి, గోపాలనాయుడు, అటవీశాఖ అధికారులు రాజేష్, శ్రీమతి భారతి, పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వనం - మనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎస్ఎస్.శ్రీధర్, ఎంపీ ఎం.శ్రీభరత్, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

84వ వార్డుకు నిధులు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి -అనకాపల్లి : జీవీఎంసీ 84వ వార్డులో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కోసం టిడిపి 84వ వార్డు ఇంచార్జ్ మాదంశెట్టి నీలబాబు జీవీఎంసీ ప్రధాన కమిషనర్ సంపత్ కుమార్‌ని శుక్రవారం విశాఖలో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నీలబాబు మాట్లాడుతూ కొత్తూరు నర్సింగరావుపేట నుండి కొప్పాక వరకు ఎన్‌హెచ్ ప్రధాన రహదారి పక్కనుండి మురుగు కాలువ లేకపోవడం వల్ల రోడ్లపై నీరు ఉండిపోతుందని తెలిపారు. దీంతో కొప్పాక గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. రెండు సంవత్సరాల నుండి ఇంజనీరింగ్ అధికారులు దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని నీలబాబు కమిషనర్‌ని కోరారు. అనకాపల్లి టౌన్‌లో చిన్న నాలుగు రోడ్ల జంక్షన్ నుండి గూడ్స్ రోడ్డు రహదారి విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

బల్లాకు గిడుగు జాతీయ పురస్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్లా నాగభూషణం గిడుగు జాతీయ స్థాయి కళా, సామాజిక విశిష్ట సేవా పురస్కారం అందుకున్నారు. గత 20 సంవత్సరాలుగా అనకాపల్లి పట్టణం, పరిసర ప్రాంతాల్లో పలు సామాజిక, కళా రంగంలో చేసిన సేవలకు గుర్తింపుగా విజయవాడ గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్, శంకరం వేదిక ఆధ్వర్యంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. విజయవాడ ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో అంతర్జాతీయ తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని అందజేసిన ఈ కార్యక్రమంలో విజయవాడ మాజీ మేయర్ తాడి శకుంతల, మాజీ ఎమ్మెల్సీ టిడి జనార్ధన్ బల్లా నాగభూషణానికి దుశ్సాలువ, జ్ఞాపిక, అవార్డు ప్రశంసాపత్రాలతో ఘనంగా సత్కరించారు.

నగర వనం ఏర్పాటుకు చర్యలు

ఫారెస్ట్ రేంజర్ రవి వర్మ

ప్రజాశక్తి -కొత్తకోట:చోడవరం ఫారెస్ట్ రేంజ్ పరిధిలో నగర వనం ఏర్పాటుకు స్థల సేకరణకు రెవెన్యూ శాఖ అధికారులకు దరఖాస్తు చేయనున్నామని చోడవరం ఫారెస్ట్ సెక్షన్ రేంజర్ పివి రవివర్మ తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా రావికమతం జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడు తూ, రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రతి రేంజ్ పరిధిలో నగర వనాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ మేరకు చోడవరం రేంజ్ పరిధిలో ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని రెవెన్యూ శాఖకు దరఖాస్తు చేయనున్నామన్నారు. చింతలపూడి లిఫ్ట్ ఇరిగే షన్లో కోల్పోయిన అటవీ భూములకు పరిహారంగా చోడవరం మండలం భోగాపురం సెక్షన్లో తమ శాఖకు కేటాయించిన కొండ ప్రాంతంలో 25 వేల టేకు మొక్కలు నాటామని పేర్కొన్నారు. మేడివాడ సెక్షన్ గుండుబాడు అటవీ ప్రాంతంలో ఐదువేల మొక్కలు, కందపూడి వద్ద



మరొక మూడు వేల మొక్కలు నాటా మని ఆయన తెలిపారు. వీటి సంరక్షణకు ప్రభుత్వం 12 లక్షల రూపాయలు నిధులు విడుదల చేసిందని చెప్పారు. చోడవరం రేంజ్ పరిధిలో జి.మాడుగుల నుంచి అనంతగిరి వరకు ఉన్న అటవీ ప్రాంతం జిల్లాల విభజనతో కోల్పోయామన్నారు. ప్రత్యామ్నాయంగా రేంజ్ పరిధిలో అటవీ ప్రాంతాన్ని పెంచేందుకు సాధ్యా సాధ్యాలపై సర్వే చేపడుతున్నామని తెలిపారు.



కంటిని పరీక్షిస్తున్న డాక్టర్ పావని

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక ఉపాధ్యాయురాలు షేక్ యాస్మిన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నక్కపల్లి 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు కే.పావని ప్రత్యేక అవసరాల విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. దృష్టి లోపం కలిగిన విద్యార్థులకు కళ్లద్దాలు ఉచితంగా అందజేస్తామన్నారు.



సిఐని సత్కరిస్తున్న నాయకులు

సిఐకు అభినందనలు

ప్రజాశక్తి -కొత్తకోట:కొత్తకోట సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కోటేశ్వరరావును శుక్రవారం గ్రామ సర్పంచ్ లోవరాజు, ఉప సర్పంచ్ దేవా, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ సత్యదేవ్, మండల ప్రధాన కార్యదర్శి శీలం శంకరరావు, ఎంపీటీసీలు పూడి దేవా, కుంచా లక్ష్మి శంకరరావు, గున్నాజీరావు, పలువురు వార్డ్ మెంబర్లు, పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో సన్మానించారు. బీజేపీ స్టేట్ కౌన్సిల్లర్ గల్లా రాజేశ్వరరావుతో పాటు నాయకులు సోమిరెడ్డి శ్రీనివాస్, నక్కా సత్యనారాయణ తదితరులు సన్మానించారు. మండల కేంద్రంలో స్కూల్స్ వదిలిన తరువాత ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని, వీటిపై దృష్టి సారించాలని కోరారు.



గోతులు పూడుస్తున్న ఈశ్వరరావు

టెంట్ హౌస్ యజమాని చొరవతో..

రోడ్డుపై గోతులు పూడ్చివేత

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలంలో కొత్తకోట నుంచి కన్నంపేట వెళ్లే రహదారిలో ఏర్పడ్డ భారీ గుంతలను గ్రామానికి చెందిన చిరు వ్యాపారి వెల్లంకి ఈశ్వరరావు మట్టితో పూడ్చివేశారు.. ఈ రహదారిలో కొత్తకోట సబ్ స్టేషన్ వద్ద ఏర్పడ్డ గుంతలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అయినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. దీంతో గ్రామానికి చెందిన టెంట్ హౌస్ యజమాని ఈశ్వరరావు ప్రమాదకర గుంతలను తాత్కాలికంగా మట్టితో పూడ్చి వేశారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన నేతలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సురేంద్రను కూటమి నాయకులు, రెల్లి సంఘం నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీడీపీ మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. నాయకులు మురళి, మధుతో పాటు జనసేన పార్టీ రూరల్ జిల్లా ఉపాధ్యక్షులు పూడి చక్రవర్తి, నాయకులు హరి, సురేష్, రెల్లిహక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పారిశుధ్య కార్మికులకు ప్రతినెలా జీతభత్యాలు అందించేలా చూడాలని కోరారు. మున్సిపల్ కమిషనర్‌ను భారతీయ జనతా పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ



కమిషనర్‌తో మాట్లాడుతున్న నాయకులు

కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కాళ్ల సుబ్బారావు, చిందాడ నూకేశ్వరరావు, పాకలపాటి అవిండ్ కుమార్ రాజు, సతీష్, సత్యనారాయణ, వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ వీరజ్యోతి



ఆరోగ్యంపై ఆరా తీస్తున్న డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ

ప్రజాశక్తి -కొత్తకోట:వర్షాలు విస్తారంగా పడుతున్న దృష్ట్యా గ్రామాలలో ఎటువంటి రోగాలు ప్రబలకుండా వైద్య సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డిఎం అండ్ హెచ్వో వీరజ్యోతి సూచించారు. కొత్తకోట పీహెచ్సి వైద్యాధికారిణి రజని ఆధ్వర్యంలో కె.గద బపాలెం గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ క్యాంపును ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. గృహ సందర్శన చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొత్తకోట పి హెచ్ సి వైద్యాధికారిణి మోహిని సురేఖ ఆధ్వర్యంలో పలు గ్రామాలలో గంబూషియా చేపలను పంపిణీ చేసారు.ఈ చేపలు వేయడంతో లార్వాలు పెరగకుండా ఉంటాయన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపి హెచ్ఈవో రామారావు, సిబ్బంది రాజు, నాయుడు పాల్గొన్నారు.

చెరువుల్లో గంబూసియా చేప పిల్లలు విడుదల

ప్రజాశక్తి- నక్కపల్లి:దోమల నివా రణకు చెరువుల్లో గంబూసియా చేప పిల్లలు వదులుతున్నట్లు గొడిచెర్ల పి హెచ్సి వైద్యాధికారి సుకన్య తెలిపారు. మండలంలోని గొడిచెర్లలో శుక్రవారం సిబ్బందితో కలిసి చెరువులో గంబూసియా చేప పిల్లలు వదిలారు. ఆమె మాట్లాడుతూ, పలు గ్రామాల్లో చెరువులు, బావుల్లో గంబూసియా చేప పిల్లలు వేశామన్నారు.

అనకాపల్లి:గంబూషియా చేపలతో దోమలను నిర్మూలించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలాజీ అన్నారు. గంబుషియా చేపలను మండలంలోని తుమ్మపాల గ్రామంలో నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో శుక్రవారం విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 5 వరకు ఈ కార్యక్రమం చేస్తున్నామని, సుమారు లక్ష చేప పిల్లల పంపిణీ జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వరహాలు దొర, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం పిహెచ్సి పరిధి నర్సింగబిల్లి, జె.తుని, చింతలపాలెం, ఈ.చౌడవాడ గ్రామాల్లోని చెరువుల్లో గంబూషియా



నక్కపల్లిలో వేస్తున్న అధికారులు

చేప పిల్లలను శుక్రవారం విడిచిపెట్టారు. డాక్టర్ యు.రమేష్, ఆరోగ్య విస్తరణాధికారి వి.ఎ.సుబ్బారావు, ఆరోగ్య బోధకలు ఎంఎస్‌వి.ప్రసాద్, జె.తుని సర్పంచ్ అరుణ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని మునగపాక, పాటిపల్లి గ్రామాల్లోని చెరువులలో శుక్రవారం దోమ కాటును నివారించే గంబుషియా చేపలను విడుదల చేశారు. కార్యక్రమంలో స్థానిక పిహెచ్సి వైద్యాధికారిని డాక్టర్ విమలగిరి, పాటిపల్లి సర్పంచ్ ఆడారి కృష్ణవేణి, వైద్యశాఖ సిబ్బంది ఆర్ దేవకాంత, ఎం నాగేశ్వరరావు, సంతోషి, దుర్గా, దేవకి, రేవతి, సుజాత, జగన్నాధరావు, జ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని అచ్యుతాపురం, హరిపాలెం పిహెచ్సి వైద్యాధికారులు డాక్టర్ శ్రావ్య, డాక్టర్ వసంత్ కుమార్ ఆధ్వర్యంలో దుప్పుతూరు, కొండకర్ల చెరువులో గంబూషియా చేప పిల్లలను వేశారు. గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమాలలో వైద్యశాఖ సిబ్బంది వేణు గోపాల్, ఎస్ శ్రీనివాస్, ఉమామహేష్, కె నాగేశ్వరరావు పాల్గొన్నారు.



వర్షంతో నిర్మానుష్యంగా ఉన్న దుకాణాలు

ముసురుతో సాగని వ్యాపారాలు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో రెండు రోజుల నుంచి ముసురు వాతావరణం నెలకొంది. ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కొద్దిపాటి వర్షం కురవడంతో చిరు వ్యాపారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. నక్కపల్లిలో వారపు సంతలో పలువురు కూరగాయల వ్యాపారులు గొడుగులు వేసుకుని ఇబ్బందులు పడుతూ విక్రయించారు. వర్షం కురవడంతో కూరగాయలు కొనేందుకు కూడా పెద్దగా జనం రాలేదు. వర్షంతో సంత ఆవరణమంతా చిత్తడిగా మారింది. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు.పలు గ్రామాల్లో రహదారులు బురద మయంగా దర్శనమిస్తున్నాయి. వర్షం పడితే వరి నాట్లు వేసేందుకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్ల పంపిణీని విజయవంతం చేయాలి

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టా త్మకంగా ఈనెల 31న పింఛన్ల పంపిణీ ఒక్కరోజులో పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఒక్క రోజు ముందుగానే ఆగస్టు 31వ తేదీన పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. అధికారులతో సమన్వయం చేసుకొని నాయకులు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నక్కపల్లి:సామాజిక పెన్షన్లు ఈనెల 31 శనివారం శత శాతం పంపిణీ చేయాలని నర్సీపట్నం డిఎల్పిఓ ఎస్ ఎస్ఎన్ మూర్తి, ఎంపిడివో శ్రీనివాస్ తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. శనివారం ఉదయం 5 గంటల నుంచి పింఛన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభించి, లబ్ధిదారులు ఇళ్లకు వెళ్లి నగదు అందజేయాలన్నారు. ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు కూడా తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో సీతారామరాజు, ఈఓపిఆర్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో గొట్టువాడ శివారు ఆణుకు గ్రామానికి నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్లో 2024-25 ఏడాదికిగాను తాత్కాలిక ప్రాతిపదికన విద్యా వాలంటీర్‌గా పని చేయుటకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి రామారావు తెలిపారు. ఇంటర్ మరియు డిగ్రీ, బి/యడ్, డి/యడ్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఆణుకు, గొట్టువాడ ప్రాంత పరిధిలోని వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు.

దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి -నాతవరం:మండలంలోని చమ్మచింత గ్రామంలో గత పది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా జ్వరాల బారినపడి ప్రజలు అవస్థలు పడుతున్నారు. మురుగు నీటి కాలువలో నిల్వ ఉన్న నీటిలో దోమల నివారణకు హెల్త్ అసిస్టెంట్ శివప్రసాద్ ఆంటీ లార్వా ఆపరేషన్ చేపట్టారు. అబేట్ మందును మురుగు నీటి గుంటల్లోని నీరు నిలువవున్న కాలవలోని పిచికారి చేశారు. మలేరియా, డెంగ్యూ, సీజనల్ ఫీవర్లపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి నరేంద్ర, ఏఎన్ఎం రామలక్ష్మి, ఆశ వర్కర్లు సుజాత, చిలకమ్మ, గుండమ్మ పాల్గొన్నారు.



పిచికారి చేస్తున్న సిబ్బంది

'ఉక్కు'పై కేంద్రంతో ప్రకటన చేయించాలి



నినాదాలు చేస్తున్న ఐద్వా నేతలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసేది లేదని కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రకటన చేయించాలని ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి 1251వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐద్వా నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మద్దతుతో కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం నడుస్తోందని, కావున తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని, ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వంతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే బిపిసిఎల్‌ను ప్రైవేటీకరణ చేయబోమని పెట్రోలియం శాఖామంత్రి హరిదీప్‌పురి ప్రకటన చేశారన్నారు. కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి క్యాపిటివ్‌మైన్స్‌ను స్టీల్‌ప్లాంట్‌కి కేటాయించకుండా స్టీల్‌ప్లాంట్ కూడా గనులు కోసం జరుగుతున్న వేలం పాటలో పాల్గొనవచ్చునని ప్రకటన చేయడం నీతిబాహ్యమైనదని విమర్శించారు. గాలి జనార్ధనరెడ్డి లాంటి వారికి మైన్స్ కేటాయించడం దుర్మార్గమన్నారు. దీక్షల్లో బొట్టా ఈశ్వరమ్మ, వి.ప్రభావతి, ఎస్. విజయ లక్ష్మి, జి.మణి బి.మమత, వై.కల్యాణి, కె.అనురాధ, బి.భారతి, కె.వరలక్ష్మి, బి.పద్మావతి పాల్గొన్నారు.

నిబద్ధతకు మారుపేరు గణపతిరావు

-నేడు పబ్లిక్ హెల్త్ విభాగ ఎస్ఇగా ఉద్యోగ విరమణ



ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : పబ్లిక్ హెల్త్ విభాగంలో ఫుల్ అడిషనల్ చార్జ్ సూపరెంటెండింగ్ ఇంజినీర్‌గా పనిచేస్తూ పట్నాల గణపతిరావు శనివారం ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లా పార్వతీపురంలో జన్మించిన ఆయన సివిల్ ఇంజినీర్‌గా ఉత్తీర్ణత పొంది, స్వయంకృషి, పట్టుదల, నిబద్ధతతో అధికారుల మన్ననలు అందుకోవడమే కాకుండా పలు అత్యున్నత స్థానాల్లో పనిచేశారు. ఆయన పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తూ విజయనగరం వాటర్ సప్లయ్‌కు సంబంధించి 10 ఎంఎల్‌డి ప్రాజెక్టు పూర్తి చేశారు. పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, నెల్లిమర్లల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. విజయనగరం నగరపాలక సంస్థలో ఆరు మాసాల్లో చాలా ప్రయోజనకర పనులు చేశారు. సెంట్రల్ గవర్నమెంట్‌లో జూనియర్ ఇంజినీర్‌గా సెంట్రల్ వాటర్ కమిషన్‌లో మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లో సుమారు రెండు సంవత్సరాల పాటు పనిచేశారు. ఆధ్యాత్మిక పుస్తక పఠనం, యోగా, ధ్యానం, సంగీతం వినడం, పాటలు పాడటం, చిత్రలేఖనం అలవాట్లు.

ఉద్యోగ ప్రస్థానం సాగిందిలా..

1987లో నగరపాలక సంస్థ విశాఖపట్నంలో ఆయన ప్రస్థానం ప్రారంభమైంది. 1992-93 మధ్య శ్రీకాకుళం మున్సిపాలిటీలో అసిస్టెంట్ ఇంజినీరుగా పనిచేశారు. 1993-2008 కాలంలో విశాఖ నగరపాలక సంస్థలో పనిచేస్తుండగా 2005లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. అనంతరం 2008-2011 వరకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంట్‌లోనూ, 2011-2012 మధ్య కాలంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బొబ్బిలి మున్సిపాలిటీలోనూ, 2012-2013 మధ్య ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా గుంటూరు నగరపాలక సంస్థలోనూ, 2014-2019 మధ్య కాలంలో విజయనగరం డివిజన్ పబ్లిక్ హెల్త్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గానూ పనిచేశారు. చివరిగా 2019 నుండి ఇప్పటివరకు డిప్యూటీ సూపరెంటెండింగ్ ఇంజనీర్‌గా, సూపరెంటెండింగ్ ఇంజినీర్ (పబ్లిక్ హెల్త్) ఫుల్ ఎడిషనల్ ఛార్జ్‌గానూ పనిచేస్తూ నేడు విశాఖలో ఉద్యోగ విరమణ పొందనున్నారు.